సాక్షి ప్రకాశం

మంగళవారం । 28 । జనవరి । 2025



కుమ్మక్కో తమ్ముడూ..
గిద్దలూరు నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సీసీ రోడ్ల పనుల్లో అవినీతి రాజ్యమేలుతోంది. టీడీపీ నేతలు అందిన కాడికి దోచుకుంటున్నారు. - 8లో..



టంగుటూరులో దొంగల హల్‌చల్
తాళాలు వేసిన ఇళ్లలో ఒకే రీతిగా దొంగలు తలుపులు పగులగొట్టి 35 సవర్ల బంగారం, 6 కేజీల వెండి, నగదు అపహరించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
31/20

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వైపాలెంలో చీటీ పాటల జోరు

యర్రగొండపాలెం: పట్టణంలో చీటీ పాటల నిర్వహణ జోరుగా సాగుతోంది. తాము కట్టిన డబ్బులకు అధిక బోనస్ వస్తుందని ఆశపడి అనేక మంది చిట్టీలు కడుతున్నారు. నెలకోసారి తాము కట్టిన డబ్బులకు ఒకే సారి పెద్ద మొత్తంలో తీసుకొని అవసరాలకు వాడుకోవచ్చన్న ఉద్దేశంతో ఉద్యోగులతోపాటు చిరు వ్యాపారులు, కూలి పనులు చేసుకునేవారు, మహిళలు చిట్టీలు నడిపేవారి ఉచ్చులో పడుతున్నారు. తమకు అన్యాయం జరిగిందని పోలీసులను ఆశ్రయిస్తే సివిల్ కేసుల పంచాయితీలు తాము చేయమని చేతులెత్తేస్తున్నారు. చేసేదిలేక బాధితులు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ చేసుకొని విడతల వారీగా చెల్లింపులు చేసుకుంటున్నారు. స్థానిక కొలుకుల రోడ్డులో ఉన్న ఒక మహిళ పెద్ద ఎత్తున చిట్టీలు నడుపుతోంది. ఒక ప్రైవేటు కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఆయన రూ.30 లక్షల చిట్టీని కట్టాడు. ప్రతి నెలా రూ.30 వేల ప్రకారం 10 నెలల పాటు కంతులను చెల్లించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రతినెలా జరిగే చీటి పాటకు తనతోపాటు మరొకరు మాత్రమే హాజరవుతున్నారు. మిగిలిన 8 మంది ఫోన్‌లలో తాము చిట్టిని ఎత్తే మొత్తాన్ని చెప్పి పాడుకుంటున్నారు. వారు ఆ నెల చీటీ పాడినట్లు రాసుకోవడం పరిపాటి అయింది. 5 నెలల పాటు ఇదే తంతు జరుగుతుండటంతో ఆయనకు అనుమానం వచ్చింది. ఇదేమిటని ప్రశ్నిస్తే మీకు ఎందుకు మంచి బోనస్ వస్తుంది కదా, మిగిలిన డబ్బులు చెల్లించండని ఆమె నుంచి సమాధానం వస్తోంది. దీంతో తాను చీటి పాటలో పాల్గొనని, కట్టిన డబ్బులు తిరిగి చెల్లించమని అడిగాడు. చిట్టీ పూర్తయిన తరువాతనే తాను డబ్బులు ఇస్తానని చెప్పిందని, చిట్టీ పూర్తయి 5 నెలలు దాటినా తాను కట్టిన రూ 74,600లు తిరిగి చెల్లించకుండా వాయిదాలు వేస్తోందని ఆయన వాపోయాడు. ఆమె ఇంటి చుట్టూ తిరగలేక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తనకు జరిగిన అన్యాయం గురించి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. తాను ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఆమెతో ఫోన్‌లో మాట్లాడారని, ఇతరుల అకౌంట్‌తో రూ 11,500లు ఫోన్ పే ద్వారా తన అకౌంట్‌లో జమ చేసి మిగిలిన అమౌంట్‌ను త్వరలో ఇస్తానని చెప్పిన ఆమె ఆ తరువాత నుంచి తగిన సమాధానం ఇవ్వడంలేదని ఆందోళన వ్యక్తం చేశాడు. ఈ విషయాన్ని పోలీసులకు చెప్పానని, సివిల్ కేసులు తాము పరిష్కరించమనే సమాధానం వారినుంచి వస్తోందని ఆయన తెలిపాడు. బోనస్ కోసం ఆశపడి తనకొచ్చే కొద్దిపాటి జీతం చిట్టీకి చెల్లించానని వాపోయాడు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించం

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: విధులు నిర్వహించడంలో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు, ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ తమీఈమ్ అన్సారియా హెచ్చరించారు. సోమవారం ప్రకాశం భవనం నుంచి జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ వివిధ కేటగిరీల్లో సచివాలయాల ద్వారా అందించాల్సిన సేవలు సక్రమంగా లేవని, ఎంపీడీవోల పర్యవేక్షణ లేకపోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరాయకొండ, వైపాలెం ఎంపీడీవోలకు షోకాజు నోటీసులు జారీ చేయాలని జెడ్పీ సీఈఓను ఆదేశించారు. స్కూలు టాయిలెట్లు తనిఖీ, బయోమెట్రిక్ హాజరు, ఏపీ సేవా సర్వీసులు పేమెంట్ డబ్బులు సకాలంలో జమ చేయడం, హౌస్ జియో కో ఆర్డినేట్స్, ఎన్‌పీసీఐ నమోదు విషయంలో సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే సహించనన్నారు. ఆరేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ కార్డుల నమోదు కోసం ఏర్పాటు చేస్తున్న శిబిరాలను సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఫిబ్రవరి 1వ తేదీ సామూహిక గృహ ప్రవేశాలు ఉన్నందున పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్, డీపీఓ వెంకటనాయుడు, సీపీఓ వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, జెడ్పీ సీఈఓ చిరంజీవి, పరిశ్రమల జీఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు షాపుల వేలం

ఒంగోలు సిటీ: జిల్లాలో కల్లుగీత కార్మికులకు మద్యం షాపులు కేటాయించడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజామొహిద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పంచాయతీ మున్సిపాలిటీ పరిధిలో కల్లుగీత కార్మికులకు లాటరీ పద్ధతిలో కేటాయించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో 17 షాపులు లాటరీ పద్ధతిన అర్హులను ఎంపిక చేసి ఇస్తారని చెప్పారు. ఒంగోలు, మార్కాపురం, సీఎస్‌పురం, పొన్నలూరు, మద్రిపూడి, పీసీపల్లి, అర్ధవీడు, వెలిగండ్ల, పుల్లలచెరువు, రాచర్ల, మద్దిపాడు, తర్లుపాడు, మార్కాపురం రూరల్, బేస్తవారిపేట, సంతనూతలపాడు, కొనకనమిట్ల, గిద్దలూరు రూరల్ ప్రాంతాల్లో షాపులు కేటాయించనున్నారు. వీటికి ఆన్‌లైన్‌లో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. 5వ తేదీ దరఖాస్తులకు చివరి తేదీ, ఫిబ్రవరి 6న వెరిఫికేషన్, 7న లాటరీ పద్ధతిలో షాపులు కేటాయిస్తారని తెలిపారు.

పచ్చ నేతలు.. భూ మేతగాళ్లు

ఖాళీగా భూమి కనిపిస్తే చాలు పచ్చనేతలు భూచోళ్లగా మారిపోతున్నారు. కూటమి ఏలుబడిలో ప్రభుత్వ భూముల ఆక్రమణల పర్వం యథేచ్ఛగా సాగిపోతోంది. అధికార పార్టీ నేతల భూ దాహానికి ప్రభుత్వ భూములు కరిగిపోతున్నాయి. గుడి..బడి అన్నది వారికి అవసరం లేదు.. అది విలువైన భూమైతే చాలు గద్దల్లా వచ్చి వాలిపోతున్నారు. యంత్రాలను తీసుకొచ్చి చదును చేసి ప్లాట్లుగా మార్చి విక్రయించేస్తున్నారు. పొన్నలూరు మండలం చెన్నిపాడు స్కూలు స్థలాన్ని దశాబ్దకాలంగా ఫలహారంలా ఆరగించేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మంత్రులు పవన్, లోకేష్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం.



పాఠశాల తూర్పు వైపు టీడీపీ నాయకులు చదును చేసిన పాఠశాల స్థలం

- చెన్నిపాడులో టీడీపీ నాయకుల భూ ఆక్రమణలు
- 2.90 ఎకరాల పాఠశాల స్థలాన్ని చదును చేసిన వైనం
- బడా నేతల అండదండలతో పదేళ్లుగా పాఠశాల స్థలం కబ్జా
- రూ.కోటి విలువ చేసే స్థలాన్ని చదును చేసి వ్యాపారానికి సన్నద్ధం
- 20 ప్లాట్లుగా మార్చి విక్రయించేందుకు యత్నం
- మంత్రులు పవన్, లోకేష్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

అధికారం ఉంది కదా అనే అహంతో తమను ఎవరూ ఏమీ చేయలేరని ఏకంగా పాఠశాల స్థలానికే ఎసురుపెట్టారు అధికార టీడీపీ నేతలు. పదేళ్లుగా పాఠశాల స్థలాన్ని ఆక్రమిస్తూ వచ్చిన వారు నేడు స్థలాన్ని చదును చేసి ప్లాట్లుగా విక్రయించేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. పొన్నలూరు మండలం చెన్నిపాడు గ్రామానికి 2007లో అప్పటి ప్రభుత్వం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంజూరు చేసింది. దీంతో గ్రామంలోని సర్వే నంబర్లు 119/3, 119/8, 127 కలిపి మొత్తం 7.02 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. అందులో కొంత స్థలంలో పక్కా భవనం నిర్మించి తరగతులు ప్రారంభించారు. ప్రస్తుతం పాఠశాల్లో 6 నుంచి 10వ తరగతి వరకు సుమారుగా 200 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే పాఠశాలకు పడమర వైపున ఉన్న సర్వే నంబర్ 119/8, 127 లోని ఖాళీగా ఉన్న 2.90 ఎకరాల పాఠశాల స్థలంపై స్థానిక టీడీపీ నాయకులు, సానుభూతి పరుల కన్ను పడింది. పదేళ్లగా తరచూ పాఠశాల స్థలాన్ని ఆక్రమిస్తున్నారు.

పదేళ్ల నుంచి దశల వారీగా..

2014లో టీడీపీ ప్రభుత్వం ఏర్పడటంతో అప్పట్లోనే స్థానిక అధికార పార్టీ నాయకులు కన్ను పాఠశాల స్థలంపై పడింది. 7.02 ఎకరాల పాఠశాల స్థలానికి ప్రహరీ లేకపోవడంతో కొందరు గ్రామంలోని టీడీపీ సానుభూతిపరులు దక్షిణం వైపు స్థలాన్ని కొద్ది కొద్దిగా ఆక్రమిస్తూ వస్తున్నారు. ఆ స్థలంలో అధికారపార్టీకి చెందిన వ్యక్తి ఏకంగా ఇల్లు నిర్మించాడు. అయితే ఇది జరిగిన కొన్ని రోజులకు 2015లో పాఠశాల చుట్టూ ఇనుప కంచె నిర్మించడానికి మన ఊరు చారిటబుల్ ట్రస్ట్ వారు ముందుకు వచ్చారు. వీరు పాఠశాల స్థలం ఆక్రమణకు గురైనట్లు గమనించి స్థలానికి హద్దులు చూపితే తమ ట్రస్ట్ తరపున కంచె నిర్మిస్తామని అప్పటి జెడ్పీ సీఈఓ ప్రసాద్‌కి ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన సీఈఓ వెంటనే పాఠశాలను సందర్శించి ఆక్రమణలు తొలగించి నివేదిక సమర్పించాలని స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓకు ఆదేశాలు జారీ చేశారు. వారు పాఠశాలను సందర్శించి ఆక్రమణలు జరిగినట్టు నిర్ధారించారు. అలాగే అప్పటి జెడ్పీ చైర్మన్ కూడా పాఠశాల సందర్శనకు రాగా పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు పాఠశాల స్థలం ఆక్రమించి ఇల్లు నిర్మించిన వారిపై ఫిర్యాదు చేశారు. అయితే అప్పటికే ఇల్లు నిర్మించినందున అంత వరకు వదిలిపెట్టి ప్రహరీ నిర్మించాలని సూచించగా పాఠశాలకు మూడు వైపులా ప్రహరీ నిర్మించారు.

అధికారుల ఆదేశాలు బేఖాతరు..

చెన్నిపాడు పాఠశాల స్థలం ఆక్రమణలపై ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ స్థానిక టీడీపీ నాయకులు మళ్లీ పది రోజుల కిందట తూర్పు వైపున ఉన్న పాఠశాల స్థలాన్ని చదును చేశారు. సుమారు కోటి రూపాయలు విలువచేసే ఈ స్థలంలో దాదాపు 20 ప్లాట్లు వేసి విక్రయించి సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నం జరుగుతున్నట్లు సమాచారం. ఈ తంతు కూడా నియోజకవర్గ బడా నేతల అండదండలతోనే జరుగుతోందని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఆక్రమణ దారులు ఇటీవల బడానేతలను కలిసి వారి వద్ద నుంచి భరోసా తీసుకున్న తరువాతనే మరోసారి పాఠశాల స్థలాన్ని చదును చేసి ప్లాట్లు వేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

స్థలాన్ని చదునుచేసి..

పాఠశాల స్థలం ఆక్రమణపై అధికారులు స్పందించడంతో 10 ఏళ్ల పాటు స్తబ్దుగా ఉన్న టీడీపీ సానుభూతి పరులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ ఆక్రమణల జోరు పెంచేశారు. గత ఏడాది జూన్ నెలలో తూర్పు వైపున ఉన్న సర్వే నంబర్ 119/8, 127 లోని సుమారు 2.90 ఎకరాల స్థలాన్ని చదును చేశారు. దీంతో పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అడ్డు తగిలి ఇది మంచి పద్ధతి కాదని, పిల్లలు చదువుకునే స్థలాన్ని ఆక్రమించడం తగదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు కనిగిరి ఆర్డీఓ, జెడ్పీ అధికారులు పాఠశాలను సందర్శించి ఆక్రమణకు గురైనట్లు నిర్ధారించి, జెడ్పీ అనుమతులు లేకుండా పాఠశాల స్థలాన్ని ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు బనాయిస్తామని అక్రమార్కులను హెచ్చరించి వెళ్లారు.

పవన్, లోకేష్‌లకు ఫిర్యాదు..

ఇదిఇలా ఉంటే జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలను పట్టించుకోకుండా పలుమార్లు పాఠశాల స్థలాన్ని ఆక్రమించి చదును చేస్తుండడంపై గ్రామస్తులు కొందరు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్‌లను కలిసి ఆధారాలతో ఫిర్యాదు చేశారు. ఫలితం మాత్రం కానరాలేదు. ఉన్నతాధికారులు పాఠశాలను సందర్శించి ఆక్రమిత స్థలాన్ని పరిశీలించి అక్రమార్కులను తీవ్రంగా హెచ్చరించి వెళ్లిపోయారు. అయితే యథాతథంగా పనులు జరుగుతూనే ఉన్నాయి.



చెన్నిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

ప్రభుత్వ బీమా పథకాలపై అవగాహన కల్పించాలి

ఒంగోలు వన్‌టౌన్:

సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు ప్రభుత్వ బీమా పథకాల పట్ల అవగాహన కల్పించాలని రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ అధికారి బీఎస్ మారుతి శశిధర్ అన్నారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 15 నుంచి జనవరి 15వ తేదీ వరకూ నిర్వహించిన జన సురక్ష శాచురేషన్ క్యాంప్‌లలో ప్రతిభ కనబర్చిన కౌన్సిలర్ల అభినందన కార్యక్రమం ఒంగోలు భాగ్యనగర్‌లోని రూడ్‌సెట్ సంస్థలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న శశిధర్ మాట్లాడుతూ జీరో అకౌంట్లు, ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన వంటి ప్రభుత్వ పథకాల పట్ల ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. ప్రజలు ప్రైవేటు ఆర్థిక సంస్థల వద్ద అప్పులు తీసుకుని అధిక వడ్డీలు కట్టలేక ఆర్థికంగా చితికిపోతున్నారన్నారు. కార్యక్రమంలో రూడ్ సెట్ డైరక్టర్ శ్రీనివాస రెడ్డి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రమేష్, అశోక్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

అమెరికా దంపతులకు శిశుగృహ చిన్నారి దత్తత

● దత్తత ధ్రువ పత్రంతో పాటు చిన్నారిని అప్పగించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా



అమెరికా దంపతులకు శిశుగృహ చిన్నారిని దత్తత ఇస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్:

అమెరికాకు చెందిన దంపతులకు ఒంగోలులోని శిశుగృహాలో ఉన్న ఒకటిన్నర సంవత్సరం వయసు ఉన్న కీర్తి అనే చిన్నారిని సోమవారం దత్తత తీసుకున్నారు. ప్రకాశం భవనంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా అమెరికాలో స్థిరపడిన గుజరాత్‌కు చెందిన దంపతులు అర్పన్ దేశాయ్, కున్నిదేశాయ్‌లకు దత్తత ధ్రువీకరణ పత్రంతో పాటు చిన్నారిని కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. దంపతులిద్దరూ సీమెన్స్ కంపెనీలో ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. దత్తత తీసుకున్న చిన్నారికి సంబంధించి చిన్నప్పుడే తల్లిదండ్రులు వద్దని శిశు సంక్షేమ అధికారులకు ఇచ్చినట్లు తెలిపారు. దీనిలో శిశు సంక్షేమ అధికారి హేనసుజన్, బాలల సంరక్షణ అధికారి పీ దినేష్‌కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక దృష్టితో ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- సమస్యలు పునరావృతం కాకూడదు
- గ్రీవెన్స్ నిర్వహించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: మీకోసం గ్రీవెన్స్ కార్యక్రమంలో వచ్చిన ప్రజా సమస్యలను ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణతో కలిసి గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. సమస్యలు పునరావృతం కాకుండా పరిష్కరించాలన్నారు. ప్రతి అర్జీపై ప్రత్యేక శ్రద్ధపెట్టి అర్థవంతమైన, నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అర్జీలను నిర్దేశిత గడువులో పరిష్కరించాలన్నారు. ఎట్టి పరిస్థితిలో అర్జీలు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ప్రతి రోజు లాగిన్ అయ్యి ఆన్‌లైన్‌లో వచ్చిన వినతులను పరిష్కరించాలన్నారు. దీనిలో డీఆర్‌ఓ చిన ఓబులేసు, డిప్యూటీ కలెక్టర్లు జాన్సన్, పార్థసారథి, విజయజ్యోతి ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



గ్రీవెన్స్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

● కొమరోలు మండలం గోపానిపల్లి ఏబీఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాల్లో సెకండరీ గ్రేడ్ టీచర్ దొనపాటి ఆంజనేయులు గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి పాఠశాల ప్రస్తుత కరస్పాండెంట్ జీతాలు నిలుపుదల చేసి వేధిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా చైల్డ్‌ఇన్ఫో నుంచి పాఠశాల హెచ్‌ఎం ఫోన్ నంబర్ తొలగించి ఎంఈఓకు లింక్ చేశారని తెలిపారు. అంతేకాకుడా 6,7 తరగతులకు సంబంధించి నకిలీ ఎన్‌రోల్‌మెంట్‌తో సుమారు 50 మంది విద్యార్థుల రోల్‌తో బోగస్ హాజరు చూపుతున్నారని ఫిర్యాదు చేశారు. వాళ్ల చెప్పినట్లు చేయడం లేదని తన జీతాలు నిలిపివేశారని, పరిశీలించి తగిన చర్యలు తీసుకుని నిలిచిన జీతాలు ఇప్పించడంతో పాటు పాఠశాలలో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేయించాలని కోరుతూ అర్జీ అందజేశారు.

● చీమకుర్తికి చెందిన గోవిందమ్మ అనే వృద్ధురాలు గ్రీవెన్స్‌కు రావడం చూసిన జాయింట్ కలెక్టర్ గోపాల కృష్ణ వేదికపైకి పిలిపించి తన పక్కనే కుర్చీలో కూర్చోబెట్టి ఆమె సమస్యను తెలుసుకుని సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

చిన్నారులకు గుండె స్క్రీనింగ్ పరీక్షలు

- ఆర్‌బీఎస్‌కే, బంగారు బాల్యం ద్వారా చర్యలు
- కార్పొరేట్ ఆస్పత్రుల వైద్యులతో చికిత్సకు చర్యలు
- పరీక్షలు పరిశీలించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న బాల భవిత కేంద్రం (డీఐసీ)లో పుట్టుకతోనే గుండె సమస్యలు ఉన్న చిన్నారులకు సోమవారం గుండె స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలను కలెక్టర్ తమీమ్ అన్సారియా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఆర్‌బీఎస్‌కే బంగారు బాల్యం ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల ద్వారా గుండె చికిత్సలు చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. స్క్రీనింగ్‌లో మొత్తం 60 మంది చిన్నారులకు పరీక్షలు నిర్వహించగా వారిలో 9 మందికి చికిత్స అవసరమని అపోలో వైద్యులు తెలిపినట్లు వివరించారు. స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించిన చిన్నారులు, వారి తల్లిదండ్రులను కలెక్టర్ పలకరించారు. చిన్న పిల్లల గుండె జబ్బుల చికిత్స కోసం చెన్నై అపోలో ఆస్పత్రితో ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. ఆ మేరకు స్క్రీనింగ్ పరీక్షలు కూడా అపోలో వైద్యులతో నిర్వహించామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు గమనించి అవసరమైన పిల్లలకు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుని అవసరమైతే చికిత్స చేయించుకోవాలని వారికి ఉచిత రవాణా సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. బంగారుబాల్యంలో భాగంగా ఈ స్క్రీనింగ్ పరీక్షలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. చిన్నపిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలు, ఎదుగుదల లోపం వంటి 32 రకాల వ్యాధులకు ఉచితంగా స్క్రీనింగ్, చికిత్స ఎంత ఖర్చు అయినా చేస్తామని కలెక్టర్ తెలిపారు. దీనిలో డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, డీఐసీ నోడల్ అధికారి భగీరథి, జీజీహెచ్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ ప్రభాకర్, డిప్యూటీ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, సీఎస్ ఆర్‌ఎంఓ మాధవీలత, అపోలో కార్డియాలజిస్ట్ డాక్టర్ అరుణ్‌విజయ్, ఇతర వైద్యులు ప్రీతమ్, చంద్రశేఖర్, రవికుమార్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



చిన్నపిల్లల గుండె పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

వీవోఏల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు

ఒంగోలు సిటీ: వెలుగు వీవోఏ లకు కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏపీ వెలుగు యానిమేటర్ ఉద్యోగుల సంఘం సీఐటీయూ ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ వీవోఏ లకు కాలపరిమితి సర్క్యులర్ మెడ మీద కత్తి లాగా ఉందని, వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ సమాఖ్య సంఘాలను కలపటం లాంటి పనులు సెర్ప్ అధికారులు ఆపాలని కోరారు. ఎక్కువ సంఘాలు ఉన్న వీవోఏ ల నుంచి తక్కువ సంఘాలు ఉన్న వీవోఏ లకు సర్దుబాటు చేయాలని, ఎటువంటి రాజకీయం ఉండకూడదని కోరుతున్నామన్నారు. ఇప్పటి వరకు 15 సంఘాల లోపు ఉన్న వీవోఏ లకు వేతనాలు చెల్లించలేదన్నారు. ఉపాధి కోల్పోయిన ప్రతి ఉద్యోగికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జెండరు, వయసు, చదువు పేరుతో తొలగింపులు ఆపాలన్నారు. వీవోఏలు వేతనాలు లేకపోయినా గ్రామ సంఘాలు ఇచ్చే కొద్దిపాటి పారితోషికానికి జీవనం సాగించారన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకాన్ని గ్రామ సంఘాల్లో చర్చించి పొదుపు సభ్యులందరికీ అందేలాగా కృషి చేస్తున్నారని చెప్పారు. వారికి హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని, పది లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. అన్ని రకాల బకాయిలు చెల్లించాలని, లోకో యాప్ వర్కు కోసం ఫైవ్‌జీ మొబైల్ ప్రభుత్వమే ఇవ్వాలని కోరారు. వలంటరీ ఐడీతో పని చేయించరాదని, వీవోఏ ల ఐడీ ద్వారా పనిచేయించాలన్నారు. ఉపాధి కోల్పోయిన వారికి నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. మహిళా మార్టులకు సరుకుల కొనుగోలుకు టార్గెట్ ఇచ్చే పద్ధతి రద్దు చేయాలన్నారు. వేతనాల చెల్లింపు చెక్కులపై సీసీ ఏపీఎం తొలగించి, వారిని విధులకు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అర్జీ అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ఆర్‌పీఏ జిల్లా అధ్యక్షుడు శేషయ్య, కాశీరత్నం, లక్ష్మీ, మాధవి, తెహరా, తదితరులు పాల్గొన్నారు.



వీవోఏలు సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

రహదారి భద్రతపై అవగాహన అవసరం

● రహదారి భద్రత బైక్ ర్యాలీ ప్రారంభించిన జేసీ

ఒంగోలు అర్బన్: రహదారి భద్రత-2025 మాసోత్సవం సందర్భంగా ఒంగోలులో సోమవారం నిర్వహించిన బైక్, ఫోర్ వీలర్ ర్యాలీని జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. రహదారి భద్రతపై ప్రజలంతా అవగాహన పెంచుకోవాలని జేసీ కోరారు. ర్యాలీ కలెక్టరేట్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు..తిరిగి కలెక్టరేట్ వరకు నిర్వహించారు. దీనిలో డీటీసీ సుశీల, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ ప్రభాకర్, రామచంద్రరావు, భానుప్రకాష్ ధర్మేంద్ర, ఏవో సుధాకర్, శ్రీనివాసరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ర్యాలీలో సుమారు 300 మంది పాల్గొన్నారు.



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న జేసీ రోణంకి గోపాలకృష్ణ

క్లుప్తంగా

ఈవీఎం గోడౌన్‌లో కలెక్టర్ తనిఖీ

ఒంగోలు అర్బన్: స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ తమీమ్ అన్సారియా సోమవారం తనిఖీ చేశారు. గోడౌన్ షట్టర్లు, తాళాల సీళ్లను పరిశీలించారు. అనంతరం భద్రతాపరంగా తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం సూపరింటిండెంట్ రాజ్యలక్ష్మి, ఇతర సిబ్బంది ఉన్నారు.

కలెక్టర్‌కు ఎన్‌జీఓల అభినందనలు



కలెక్టర్ తమీమ్ అన్సారియాను సత్కరిస్తున్న ఎన్‌జీఓ సంఘ నాయకులు

ఒంగోలు అర్బన్: ఉత్తమ ఎలక్టోరల్ అధికారిగా అవార్డు అందుకున్న కలెక్టర్ తమీమ్ అన్సారియాను సోమవారం ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శరత్‌బాబు, కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిసి అభినందనలు తెలిపి సత్కరించారు. మహిళా ఉద్యోగుల కోసం వెయిటింగ్ హాలు కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. అసోసియేషన్ నాయకులు వెంకటేశ్వరరావు, శివకుమార్, తోట శ్రీనివాసు, రామాంజనేయులు, కె చిరంజీవి, కృష్ణ కిషోర్, విజయ్‌కుమార్, కిరణ్, మోయిన్, మంజేష్, షరీఫ్, కరిముల్లా, నారాయణమ్మ, కోటేశ్వరమ్మ, శిరీషా, పద్మజ, జయమ్మ, తులసి తదితరులు పాల్గొన్నారు.

రెండు ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ



మీర్జపేటలో దొంగలు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

తర్లుపాడు: తర్లుపాడు మండలంలో రైతుల పొలాల్లో దొంగల చెలరేగిపోతున్నారు. ఆరుగాలం కష్టించి పంటలు పండించుకునేందుకు ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు ధ్వంసం చేస్తున్నారు. పోలీసు కేసులు నమోదవుతున్నప్పటికీ దొంగలు దొరకడం లేదు. గత నెలలో మండలంలోని మీర్జపేట, నాగెళ్లముడుపు గ్రామాల్లో పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేయగా ఆదివారం రాత్రి అదే గ్రామాల్లో మళ్లీ దొంగతనానికి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన దేవిరెడ్డి రమణారెడ్డి, వాటర్ వర్క్స్‌కు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగితీగను తీసుకెళ్లారు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కుమ్ముకో తమ్ముడూ!



''వాట్ ఐయామ్ సేయింగ్.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదు. ఎన్నికల హామీలను ఇప్పుడు అమలు చేయడం సాధ్యం కాదు. ప్రజలు అర్థం చేసుకోవాలనే ఇవన్నీ మాట్లాడుతున్నా'' అంటూ ఓ వైపు సీఎం చంద్రబాబునాయుడు సన్నాయి నొక్కులు నొక్కుతుంటే.. అధికార టీడీపీ నేతలు మాత్రం ప్రజా ధనాన్ని పప్పుబెల్లంలా బొక్కుతున్నారు. ఉపాధి హామీ పనులను నిబంధనలకు విరుద్ధంగా చేపడుతూ నిధులు దుర్వినియోగం చేస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గిద్దలూరు నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సీసీ రోడ్ల పనుల్లో అవినీతి రాజ్యమేలుతోందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

- గిద్దలూరు నియోజకవర్గంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.15 కోట్ల ఉపాధి హామీ నిధులు
- సర్పంచ్‌లను పూచికపుల్లలా తీసేసి ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్న వైనం
- విజయవాడకు చెందిన కన్‌స్ట్రక్షన్ కంపెనీ, కర్నూలుకు చెందిన వెండర్‌కు అప్పగింత
- అవసరం లేని చోట పనులు.. గతంలో ఉన్నవాటిపై మళ్లీ రోడ్లు
- ప్రజాధనాన్ని పప్పుబెల్లంలా దగమింగడమే ధ్యేయంగా ముందుకు..



గిద్దలూరు : ముండ్లపాడులో ఎర్త్‌వర్క్ చేయకుండానే నిర్మించిన సీసీ రోడ్డు

బేస్తవారిపేట:

అధికార టీడీపీ నేతల జేబులు నింపడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇస్తానన్న సంక్షేమ పథకాలను పక్కన పెట్టి టీడీపీ కాంట్రాక్టర్లు, నాయకుల జేబుల్లోకి నిధులు మళ్లిస్తోంది. ఉపాధి హామీ పథకం కింద నిర్మిస్తున్న సీసీ రోడ్లను పంచాయతీల తీర్మానంతో సంబంధం లేకుండా టీడీపీ నేతలు పావులు కదిపారు. నామినేషన్ కింద వర్క్ కమిటీలను ఏర్పాటు చేసుకుని, వెండర్ అకౌంట్‌లో బిల్లులు పడేలా సరికొత్త దోపిడీకి తెరతీశారు. గిద్దలూరు నియోజకవర్గంలోని కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు, రాచర్ల మండలాల్లో విజయవాడకు చెందిన ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీ పేరుతో రూ.10 కోట్ల పనులు, గిద్దలూరు, కొమరోలు మండలాల్లో కర్నూలుకు చెందిన ఓ వెండర్ పేరుతో రూ.5 కోట్ల పనులు ప్రారంభించారు. ఈ పనులన్నీ గతంలో పంచాయతీలకు మంజూరయ్యేవి. నగదు కూడా పంచాయతీల అకౌంట్లలోనే జమ అయ్యేవి. కానీ గిద్దలూరు ఎమ్మెల్యే ఎన్నడూ లేని విధంగా కొత్త అంకానికి తెరదీశారు. నగదు వెండర్ అకౌంట్‌లో పడేలా పక్కాగా పథకం రచించారు.

ఎన్నికల సమయంలో అలా..

పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉన్న డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఎన్నికలకు ముందు పలు హామీలు ఇచ్చారు. అధికారంలోకి రాగానే గ్రామ పంచాయతీలకు ప్రాణ ప్రతిష్ట చేస్తామని బాకా ఊదారు. గత ప్రభుత్వం పంచాయతీలను, సర్పంచ్‌లను చిన్నచూపు చూసిందని కూడా ఆరోపించారు. సర్పంచ్‌ల అధికారాన్ని కాపాడి గౌరవ మర్యాదలు కల్పిస్తామన్నారు.

అధికారంలోకి వచ్చాక ఇలా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సర్పంచ్‌లకు కనీస మర్యాద కూడా ఇవ్వడం లేదు. వారి విధులను, అధికారాలను ఎమ్మెల్యేలు తమ చేతిలోకి తీసుకున్నారు. సర్పంచ్‌లకు తెలియకుండానే పంచాయతీల్లో ఉపాధి హామీ నిధులతో వెండర్ల పేరుతో పనులు చేస్తున్నారు. సర్పంచ్‌ల గౌరవ మర్యాదలు గంగలో కలిపేశారు.

సర్పంచ్‌ల అధికారానికి తూట్లు

గ్రామాల్లో ఎక్కువ శాతం వైఎస్సార్ సీపీ సానుభూతిపరులే సర్పంచ్‌లుగా ఉండటంతో కూటమి నేతలకు కంటగింపుగా మారింది. అడ్డగోలుగా పనులు చేపట్టేందుకు పంచాయతీ తీర్మానాలు ఇవ్వరని గ్రహించి వెండర్ వ్యవస్థను తీసుకొచ్చినట్లు ఆరోపణలున్నాయి. గతంలో ఉపాధి హామీ పనులు చేస్తే సర్పంచ్‌ల అకౌంట్‌లో నిధులు జమ అయ్యేవి. నేడు వెండర్ అకౌంట్‌లో నిధులు పడుతున్నాయి. పల్లె పండుగలో సర్పంచ్‌ల ఆమోదం అవసరం లేకుండానే సీనియర్ సిటిజన్ల సంతకాలతో రూ.కోట్ల విలువైన పనులకు తీర్మానం చేయడం గమనార్హం.



కంభం నెహ్రూనగర్‌లో టీడీపీ నాయకుడి ఇంటికి సీసీ రోడ్డు

పనుల్లో ఇష్టారాజ్యం

టీడీపీ నాయకుల గృహాలు ఉన్నచోట, గతంలో వేసిన రోడ్లపై మళ్లీ రోడ్లు వేసి ప్రజాధనాన్ని పక్కదోవ పట్టిస్తున్నారు. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రోడ్లు దారుణంగా తయారైనా వాటిపై దృష్టి పెట్టకుండా ఏమాత్రం అవసరంలేని చోట రోడ్డు పనులు చేయడంపై విమర్శల వర్షం కురుస్తోంది.

- గిద్దలూరు మండలంలోని ముండ్లపాడులో ఎర్త్ వర్క్ పనులు చేయకుండానే రూ.20 లక్షల సీసీ రోడ్డు నిర్మించారు.
- కంచుపల్లె సచివాలయం పక్క వీధిలో సీసీ రోడ్డు ఎర్త్‌వర్క్ చేయలేదు. సచివాలయం వద్ద ఇసుక, కంకర, డస్ట్ డంపు చేసే సమయంలో సచివాలయం మెట్లు, శిలాఫలకాలు ధ్వంసం చేశారు.
- కంభంలోని నెహ్రూబజార్ 5వ లైన్‌లో ఓ టీడీపీ నాయకుడి ఇంటి కోసం రూ.6 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు.
- రాచర్ల మండలం అనుములవీడులో మూడు పాత సీసీ రోడ్లపై మళ్లీ రోడ్లు వేశారు. వీటిలో ఒక రోడ్డు మాత్రమే మరమ్మతులకు గురైంది. చిన్నమసీదు సెంటర్ పరిసర ప్రాంతాల్లోని సీసీ రోడ్లు బాగున్నప్పటికీ వాటిపై కొత్త రోడ్లు నిర్మించారు. యడవల్లిలో గృహాలు లేనిచోట సీసీ రోడ్లు నిర్మించి ప్రజాధనాన్ని వృథా చేశారు. చోళ్లవీడులో ఎవరూ లేని శ్మశానవాటిక వద్ద సీసీ రోడ్డు నిర్మించారు.
- కొమరోలులో విద్యుత్ శాఖ ఏఈ కార్యాలయం నుంచి గోపాలునిపల్లె ఎస్సీ కాలనీ వరకు రాకపోకలు జరగని చోట రూ.24 లక్షలతో రోడ్డు నిర్మించేందుకు ఎర్త్‌వర్క్ పనులు చేశారు.
- గోపానుపల్లెలో గృహాలు లేనిచోట అవసరం లేకున్నా రెండు రోడ్లను కలుపుతూ కొంత మేర, చిల్లకంప, దొడ్లలో సీసీ రోడ్డు నిర్మించారు.
- బేస్తవారిపేట మండలంలోని మోక్షగుండంలో ప్రాథమికోన్నత పాఠశాల సమీపంలో టీడీపీ నాయకుల పొలాలకు వెళ్లేందుకు రూ.7 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు.



రాచర్ల మండలం చోళ్లవీడులో శ్మశానవాటిక వద్ద రోడ్డు



కొమరోలు : రాకపోకలు లేని కొమరోలు నుంచి గోపాలునిపల్లె ఎస్సీ కాలనీలో రోడ్డు



కంభంలో అధ్వానంగా ఉన్న రైల్వేస్టేషన్ రోడ్డు



కొమరోలు : గోపానుపల్లెలో అవసరం లేని చోట సీసీ రోడ్డు

అ'పూర్వ'ం.. ఐదు దశాబ్దాల స్నేహం



బీచ్‌లో సందడి చేస్తున్న పూర్వ విద్యార్థులు

- 50 ఏళ్ల తర్వాత మడనూరు బీచ్‌లో కలుసుకున్న ఒంగోలు మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు

కొత్తపట్నం: ముదిమి వయసును వారు లెక్క చేయలేదు. అంతా చిన్నపిల్లల్లా మారిపోయారు. ఐదు దశాబ్దాల స్నేహంలో మధుర క్షణాలు, చిన్ననాటి చిలిపి చేష్టలను గుర్తు చేసుకుని సందడి చేశారు. ఆత్మీయ పలకరింపులు, ఆనందాల అనుభూతికి మడనూరు బీచ్ వేదికగా నిలిచింది. ఒంగోలు మున్సిపల్ హైస్కూల్లో 1974లో పదో తరగతి పూర్తి చేసుకున్న 80 మంది సోమవారం మడనూరు బీచ్‌లో ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. ముందుగా మున్సిపల్ హైస్కూల్‌ను సందర్శించి, మడనూరు బీచ్‌కు చేరుకున్నారు. బాల్య మిత్రుల్లో కొందరు అనారోగ్యంతో మరణించగా వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించి నివాళులర్పించారు. ఉద్యోగులు, వ్యాపారులు, రైతులుగా స్థిరపడిన వారు తమ అనుభవాలను పంచుకున్నారు. ఇకపై ఏటా కలుసుకోవాలని నిర్ణయించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కారుమూడి ఆంజనేయులు, దండు అంజిరెడ్డి, ఎలమంద బాబు, షేక్ నిరాజ్, ఆరిగ మల్లికార్జున, మొలకలపల్లి వెంకటేశ్వర్లు, నాగమల్లేశ్వరి, గిరిజ, చివుకుల అనూరాధ, ఉషా, ఉమామహేశ్వరి, డాక్టర్ రాధా రాణి తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరులో దొంగల హల్‌చల్



బెల్లం రామయ్య ఇంటిని పరిశీలిస్తున్న క్లూస్ టీమ్



దామచర్ల హనుమాయమ్మ ఇంట్లో చెల్లాచెదురుగా పడిన వస్తువులు

- తాళాలు వేసిన మూడు ఇళ్లలో చోరీ
- 36 సవర్ల బంగారం, 6 కేజీల వెండి, రూ.85 వేల నగదు అపహరణ

టంగుటూరు: తాళాలు వేసిన ఇళ్లల్లో ఒకే రీతిలో దొంగలు తలుపులు పగలగొట్టి బంగారం, వెండి, నగదు అపహరించారు. ఈ సంఘటన టంగుటూరులో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. టంగుటూరులో నివాసం ఉండే దామచర్ల హనుమాయమ్మ తూర్పునాయుడుపాలెంలో కుమారుడి ఇంటికి ఆదివారం మధ్యాహ్నం వెళ్లారు. ప్రధాన గేటుకు తాళం వేసి ఉండగా గోడ దూకి వెళ్లిన దొంగలు ఇనుప రాడ్డుతో తలుపు తాళం పగలగొట్టి ఇంట్లో బీరువాలో ఉంచిన 17 సవర్ల బంగారం, ఒక కేజీ వెండి, రూ.20 వేల నగదు అపహరించారు. అలాగే వెటర్నరీ ఆసుపత్రి సమీపంలో ఉండే బెల్లం రామయ్య గత సోమవారం ఇంటికి తాళాలు వేసి పని నిమిత్తం వైజాగ్ వెళ్లగా దుండగులు తలుపులు పగలగొట్టి ఇంట్లో ఉన్న 19 సవర్ల బంగారం, 5 కేజీల వెండి, రూ.50 వేల నగదుతో ఉడాయించారు. అలాగే టంగుటూరు విష్ణాలయం సమీపంలో నివాసం ఉంటున్న ఏపీజీబీ మాజీ మేనేజర్ పత్తిపాటి బ్రహ్మానందం గత గురువారం హైదరాబాద్ వెళ్లి తిరిగి సోమవారం ఇంటికి వచ్చి చూడగా తలుపులు పగలగొట్టి ఉన్నాయి. ఇంట్లో పరిశీలించి రూ.15 వేల నగదు మాయమైనట్లు గుర్తించారు. అయితే మూడు ఇళ్లలో ఎవరూ లేకపోవడం, ఒకే రీతిలో రాడ్డుతో తలుపులు పగలగొట్టి ఉండటంతో ఈ మూడు చోరీలు చేసింది ఒక్కరే అని అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న క్లూస్ టీం అధికారులు ఆయా ఇళ్లలో వేలిముద్రలు సేకరించారు. ఎస్సై ఓ కేసు విచారణ నిమిత్తం విజయవాడ వెళ్లగా, సిబ్బంది తీరుపై అసహనంతో ఫిర్యాదు చేయడానికి వెనుకాడిన బాధితులు స్టేషన్ వద్ద పడిగాపులు కాశారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 76 ఫిర్యాదులు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు సిటీ: ప్రజా ఫిర్యాదులపై సత్వరమే స్పందించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ జిల్లాలోని పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యల పూర్వాపరాలు తెలుసుకున్నారు. పోలీస్ గ్రీవెన్స్‌కు మొత్తం 76 ఫిర్యాదులు అందాయి.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

= తనతోపాటు మరో పది మంది వ్యక్తులకు ఐటీ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ఒంగోలుకు చెందిన ఒక మహిళ రూ.30 లక్షలు తీసుకుని బెంగళూరులోని ఓ ఫేక్ కంపెనీకి పంపించి మోసం చేసిందని, తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని బాధితులు ఫిర్యాదు చేశారు.

= తన ఆధార్, పాన్‌కార్డు, బ్యాంక్ డిటెయిల్స్ తీసుకుని లోన్ మంజూరు అయిందని నమ్మబలికి ఇన్సూరెన్స్, ఫస్ట్ ఇన్‌స్టాల్‌మెంట్, ఇతర కారణాలు చెప్పి పలు దఫాలుగా రూ.77,789 ఫోన్ పే చేయించుకుని సైబర్ నేరగాడు మోసం చేశాడని ఓ బాధితుడు వాపోయాడు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులకు ఎలాంటి వివరాలు తెలియజేయవద్దని స్పష్టం చేశారు. ఏదైనా అనుమానం ఉంటే పోలీస్ హెల్ప్‌లైన్ 1930కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సురేష్‌బాబు, చీమకుర్తి సీఐ సుబ్బారావు, ఒంగోలు ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, డీటీసీ సీఐ షమీముల్లా, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సైలు రజియా సుల్తాన్, ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు పొగాకు బ్యారన్లు దగ్ధం



మాచవరంలో దగ్ధమవుతున్న బ్యారన్

మద్దిపాడు/కనిగిరి రూరల్: జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో సోమవారం రెండు పొగాకు బ్యారన్లు అగ్నికి ఆహుతయ్యాయి. మద్దిపాడు మండలంలోని తెల్లపాడు గ్రామంలో ఉన్నం కోటేశ్వరరావుకు చెందిన బ్యారన్‌లో పొగాకు క్యూరింగ్ చేస్తుండగా పొగగొట్టంపై ఆకులు పడటంతో మంటలు చెలరేగాయి. బ్యారన్‌లోని పొగాకు, టైర్లు పూర్తిగా కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. సుమారు రూ.5 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కనిగిరి పట్టణ సమీపంలోని మాచవరం గ్రామంలో బొజ్జా బ్రహ్మయ్యకు చెందిన బ్యారన్ ప్రమాదవ శాత్తు కాలిపోయింది. అగ్నిమాపక కేంద్ర అధికారి బంగారు బాబు తమ సిబ్బందితో కలిసి మంటలు అదుపు చేశారు. అప్పటికే బ్యారన్‌లోని పొగాకు, ఇతర సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు చెబుతున్నారు.

జాతీయ హాకీ పోటీలకు చీమకుర్తి క్రీడాకారుడు



జాతీయ హాకీ పోటీలకు ఎంపికైన చీమకుర్తి క్రీడాకారుడు

చీమకుర్తి: చీమకుర్తి గెలాక్సీ స్పోర్ట్స్ క్లబ్‌కు చెందిన ఎ.సూర్యతేజ జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యాడు. అండర్-19 స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రకాశం జిల్లా తరపున సూర్యతేజ పాల్గొన్నట్లు కోచ్ కె.వెంకట్ తెలిపారు. ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు జార్ఖండ్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ జట్టు తరపున సూర్యతేజ ప్రాతినిధ్యం వహిస్తాడని పేర్కొన్నారు.